నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
3 | మంగళవారం 9 ఏప్రిల్ 2024 | MAHABUBABAD

హనుమకొండలో..

నేడు ఉగాది పర్వదినం సందర్భంగా పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్‌లో సందడి నెలకొంది. ఉగాది పచ్చడి కోసం మామిడికాయలు, వేపపూలు, ఇతరత్రా వస్తువులను కొనేందుకు వచ్చిన ప్రజలతో కిటకిటలాడాయి. ఆలయాల్లో పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు నిర్వహించనున్నారు.

క్రోధి.. శుభ ఉగాది

కొంగొత్త ఆశలతో తెలుగు నూతన సంవత్సరానికి స్వాగతం

ఆలయాల్లో పంచాంగ శ్రవణం, ప్రత్యేక పూజలకు సిద్ధం

తెలుగు సంవత్సరంలో మొదటి రోజు వచ్చేదే 'ఉగాది'. చైత్ర శుక్ల పాడ్యమి నాడు ఈ పండుగను ఘనంగా జరుపుకొంటారు. ఎన్నెన్నో ఆనందానుభూతులు, ఆటుపోట్లను మిగిల్చిన శోభకృత్ నామ సంవత్సరం, క్రోధి నామ సంవత్సరాన్ని స్వాగతిస్తూ వెళ్లిపోయింది. ఈ పర్వదినం తమ జీవితాల్లో కోటి కాంతులు నింపాలని కోరుకుంటూ 'ఉగాది'ని మంగళవారం ఉమ్మడి జిల్లావాసులు ఘనంగా జరుపుకోనున్నారు. కాగా, భీలావరంగల్ గుండుచెరువు వద్ద ఉదయిస్తున్న సూర్యుడు, అప్పుడే లేచి రెక్కలు విప్పుతున్న బాతులు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నట్లున్న దృశ్యాన్ని 'నమస్తే తెలంగాణ' తన కెమెరాలో బంధించింది.

– ఫొటోగ్రాఫర్, వరంగల్, ఏప్రిల్ 8

కలిసికట్టుగా పనిచేద్దాం

- **పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేద్దాం**
- **మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దిశానిర్దేశం**
- **వర్ధన్నపేట నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృత సమావేశం**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పక్కన బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ, ఏప్రిల్ 8 : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, శ్రేణులు కలిసికట్టుగా పనిచేసి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో గులాబీ జెండాను ఎగురవేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలోని ఆయన నివాసంలో వర్ధన్నపేట నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎర్రబెల్లితో పాటు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ పార్టీకి మండల, గ్రామ కమిటీలే సుప్రీం అన్నారు. ఇతర పార్టీలు బీఆర్ఎస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నాలను కార్యకర్తలు తిప్పికొట్టాలన్నారు. కార్యకర్తలందరూ కలిసి ఉండాలని సూచించారు. ప్రజల్లో మార్పు వస్తోందని.. మోసపోయాం అని తెలుసుకున్నారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఈ మార్పు కనిపిస్తుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీని చూస్తే ఇతర పార్టీల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం మీద సీఎం రేవంత్‌రెడ్డి బురద చల్లాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు, రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బెదిరింపు రాజకీయాలకు ఎవరూ తలవంచ వద్దన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎవరి సత్తా ఏంటో తెలుస్తుందన్నారు. కార్యకర్తలు సమన్వయంతో కలిసికట్టుగా ఉండాలని ఎర్రబెల్లి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వర్ధన్నపేట నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మండల, గ్రామ కమిటీ నాయకులు, తాజా మాజీ సర్పంచ్‌లు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, యువజన సోషల్ మీడియా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సొంతగూటికి తాజా మాజీ సర్పంచ్‌లు

బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

బీఆర్ఎస్‌లోకి సదానందం, సురేశ్‌ను ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

ఐనవోలు మండలానికి చెందిన తాజా, మాజీ సర్పంచ్‌లు సొంతగూటికి చేరారు. సోమవారం హనుమకొండలోని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన వర్ధన్నపేట నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం సందర్భంగా వారిని ఎర్రబెల్లి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఐనవోలు మండలానికి చెందిన పల్లకొండ సురేశ్, బరిగెల సదానందం ఉన్నారు.

సైకిల్‌పై వెళ్తూ.. ప్రజలను చైతన్యపరుస్తూ

ట్రాఫిక్ నిబంధనలు, పలు అంశాలపై సూచనలు

51 కిలోమీటర్లు సైకిల్‌యాత్ర చేసిన పాలకుర్తి సీఐ

సైకిల్‌పై వెళ్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

దేవరుప్పుల, ఏప్రిల్ 8 : రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలను చైతన్యపర్చడంతో పాటు ఫ్రెండ్లీ పోలీసే ధ్యేయంగా పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ప్రతిరోజూ ఉదయం సైకిల్‌పై 51 కిలోమీటర్లు తన పరిధిలోని పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల్లో పర్యటించాలని నిర్ణయం తీసుకొని శనివారం దేవరుప్పుల మండలం నుంచి యాత్ర ప్రారంభించారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం సైకిల్‌పై బయల్దేరిన మహేందర్‌రెడ్డి నలుగురు కూడిన చోట, కూడళ్లలో, యువత ఉన్న చోట ఆగి మాట్లాడారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దని, హెల్మెట్ లేకుండా వాహనం నడుపొద్దని సూచనలు చేశారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే అనర్థాలను వారికి వివరించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో కలిగే ఉపయోగాలను స్థానిక ప్రజాప్రతినిధులకు వివరిస్తున్నారు. యువత డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచిస్తున్నారు. రోడ్లపై ధాన్యాన్ని ఆరబోస్తే వాహనాలు ప్రమాదాలకు గురవుతాయని చెబుతున్నారు. చిప్పరాళ్లబండ తండాలో హమాలీలతో మాట్లాడి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మరోవైపు సీతారాంపురంలో అనాథ వృద్ధులను కలిసి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. దేవరుప్పుల ఠాణాలో పోలీసులతో మాట్లాడారు. సీఐ వెంట దేవరుప్పుల పోలీసులు యాకేశ్, సంపత్ ఉన్నారు.

చిప్పరాళ్లబండ తండాలో హమాలీలతో మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి